క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



మహానేత వైఎస్సార్ విగ్రహం చేతిని విరగ్గొట్టిన దుండగులు

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహానికి ఉన్న చేతిని విరగ్గొట్టిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని మంత్రి ఉషశ్రీచరణ్‌కు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పెనుకొండకు వస్తున్న సందర్భంగా టీడీపీ వర్గీయులు ఈ దురాగతానికి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవాంగం కులానికి చెందిన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి బుధవారం మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతును పార్టీ కండువావేసి ఆహ్వానిస్తున్న నాయకులు

మడకశిర: నియోజకవర్గానికి చెందిన దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయ కర్త ఈర లక్కప్ప, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు అశోక్‌కుమార్ ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేస్తానని హనుమంతు తెలిపారు.

ఆర్‌పీజీటీ రోడ్డు పేరు మార్చొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

హిందూపురం: పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డు పేరు మార్పు చేయొద్దంటూ హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి వస్తున్న సమయంలో కొందరు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. ఈ విషయంపై హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం విక్రేతల అరెస్టు

పరిగి: మండలంలోని కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. పరిగి పరిధిలో శివప్ప నుంచి 33 కర్ణాటక టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే శాసనకోటలో నాగరాజు నుంచి 29 కర్ణాటక టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిద్దరిపై వేర్వేరుగా కేసు నమోదు చేశామన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెడ్డపేరు తీసుకురావడానికి కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మడకశిర సమన్వయకర్త ఈర లక్కప్ప, పార్టీ పరిశీలకుడు అశోక్‌కుమార్, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్ తదితరులు మాట్లాడారు. ఈర లక్కప్పకు రోజురోజుకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతుండడంతో ఓర్వలేని కొంత మంది కావాలనే పార్టీని బలహీన పర్చడానికి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీకి చెందిన క్వారీ నిర్వాహకులతో వైఎస్సార్‌సీపీ నాయకులు లాలూచి పడినట్లు వచ్చిన ఆరోపణలను వారు ఖండించారు.

ప్రభుత్వ బడులకు నూతన శోభ

- నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా మారిన ప్రభుత్వ పాఠశాలలు
- అదనపు గదులు, ప్రహరీల నిర్మాణంతో తప్పిన ఇబ్బందులు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుతున్న విద్యార్థులు

మడకశిర నియోజకవర్గంలో ఇలా..

మొత్తం పాఠశాలలు	351
నాడు-నేడు ద్వారా ఆధునీకరించినవి	284
ఖర్చు చేసిన మొత్తం	రూ.59.14 కోట్లు

నాడు



ఒకప్పుడు గుడిబండ మండలం శంకరగల్లు ప్రాథమిక పాఠశాల దుస్థితి

నేడు



అన్ని వసతులతో సరికొత్తగా మారిన శంకరగల్లు ప్రాథమిక పాఠశాల

అగళి/మడకశిర రూరల్: విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. నాడు - నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దడంతో విద్యార్థులు చదువులు సాఫీగా సాగిపోతున్నాయి. అమ్మఒడి, విద్యా కానుకలు పకడ్బందీగా అందుతుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మడకశిర నియోజకవర్గంలో..

మడకశిర నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ పాఠశాల, కేజీబీవీల్లో అదనపు గదులు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అలాగే పాఠశాల చుట్టూ ప్రహరీల నిర్మాణానికి నిధులివ్వడంతో పాఠశాలలు సుందరంగా తయారయ్యాయి. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులు కూర్చొవడానికి బల్లలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రహరీల మీద దేశ నాయకుల చిత్ర పటాలు, దేశ, రాష్ట్ర ముఖ్య చిహ్నాలు, జంతువుల బొమ్మలు అందంగా చిత్రీకరించడంతో సరికొత్తగా కనిపిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వబడుల్లో వెల్‌కమ్ బోర్డులు, అత్యాధునిక మరుగుదొడ్లు, మంచినీళ్ల సౌకర్యం అందుబాటులోకి తేవడంతో ఇప్పుడు విద్యార్థులకు ఏ ఇబ్బందీ లేకుండా పోయింది.



అగళి మండల ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ బోధన చేస్తున్న దృశ్యం



అగళి మండల మధూడి ఉన్నత పాఠశాలలో ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన వేదిక



సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్న గౌడనహళ్ల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల



అగళి మండల ఇనగలూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక మరుగుదొడ్లు

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి..



నేను ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చడంతో మా స్కూల్ కార్పొరేట్ పాఠశాల కంటే బాగుంది. గతంలో పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివే వాడు. సౌకర్యాలు బాగుండటంతో ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో చేరాను. ఉపాధ్యాయులు చదువు కూడా అర్థమయ్యేలా చెబుతున్నారు.

– అఖిలేష్, 10వ తరగతి, ఆమిదాలగొంది, మడకశిర మండలం

ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు



ప్రభుత్వ బడులను అన్ని విధాలా సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. దీంతో నాలాంటి పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా పోయింది. విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చారు. ప్రభుత్వ సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకుంటా.

– భవ్య, 7వ తరగతి, బుళ్లసముద్రం, మడకశిర మండలం

తల్లిదండ్రులపై భారం తగ్గింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగంలో తీసుకొచ్చిన మార్పులతో తల్లిదండ్రులపై భారం తగ్గింది. పైసా ఖర్చు లేకుండా చదువుకోవడానికి కావాల్సి అన్ని సౌకర్యాలు కల్పించారు. క్రమశిక్షణతో చదువుకొని తల్లి దండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తా.

– హర్షిత, 10వ తరగతి, మధుడి, అగళి మండలం

డ్రైనేజీ ప్రొటెక్షన్‌వాల్‌కు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ప్రజల సౌకర్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. అభివృద్ధి పనులతో పాటు ప్రజా రక్షణ కోసం కూడా చర్యలు తీసుకుంటున్నాం' అని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త టీఎన్.దీపిక అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు వద్ద రూ. 40 లక్షల వ్యయంతో శ్రీకంఠపురం బ్రిడ్జి ప్రొటెక్షన్ వాల్, డ్రైనేజీ నిర్మాణానికి కౌన్సిలర్ గిరి అధ్యక్షతన చేపడుతున్న పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తోందన్నారు. పురంలో దశాబ్దాల తరబడి టీడీపీ వాళ్లే ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టలేదన్నారు. అప్పడప్పుడూ వచ్చి పోయే ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలో చాలా మార్గాల్లో పురాతన బ్రిడ్జిలు శిథిలమై వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారని తెలిపారు. దీనిపై దృష్టి సారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు చోట్ల బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే శ్రీకంఠపురం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం డ్రైనేజీ, ప్రొటెక్షన్ వాల్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్‌పర్సన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంతరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి



వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

హిందూపురం టౌన్: ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో నిలిచి, తల్లిదండ్రులకు, గురువులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో కరస్పాండెంట్ బైసాని రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వసతి పంచమి సరస్వతీ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు.

రూ.59.40 కోట్లతో బడ్జెట్ ఆమోదం

- బకాయిల అంశంపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

హిందూపురం: 'హిందూపురం అభివృద్ధి కోసం ఒక సారైనా ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో నోరు విప్పారా? గొల్లపల్లి రిజర్వాయర్ కోసం ఆయన పెట్టిన అప్పులకుంపటికి ప్రతి ఏడాది రూ.6 కోట్ల మేరకు మున్సిపాల్టీ చెల్లించాల్సి వస్తోంది. దీనివల్ల పట్టణాభివృద్ధి కుంటుపడింది' అని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా, ఇర్షాద్ అహ్మద్, నాగేంద్రబాబు ధ్వజమెత్తారు. హిందూపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. బకాయిల వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చైర్‌పర్సన్ కల్పించుకోవడంతో సద్దుమణిగింది. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొన్ని సవరణలతో రూ.59.40 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్‌పై కౌన్సిలర్ ఆసీఫ్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు తగ్గట్టుగా వసూళ్లు చేయడం లేదని, దీని వల్ల ఆదాయం కన్నా ఖర్చే అధికమవుతోందని అన్నారు. కమిషనర్ శ్రీకాంతొరెడ్డి వివరణ ఇస్తూ సర్‌చార్జీ కింద రూ.6 కోట్ల వరకూ గొల్లపల్లి రిజర్వాయర్‌కు చెల్లించాల్సి వస్తోందని, ప్రతి నెల రూ.1.80 కోట్లు ఖర్చు అవుతోందన్నారు. ఇలా ఏడాదికి రూ.21 కోట్ల వరకూ ఖర్చు అవుతోందని చెప్పారు.

ఘనంగా వసంత పంచమి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠేశ్వర స్వామి సముదాయ ఆలయంలో బుధవారం ఘనంగా వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. అర్చకులు సరస్వతీదేవిని ప్రత్యేకంగా అలకరించి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సరస్వతి విద్యా మందిరంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. వేద పండితులు చిన్నారులతో బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు.



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. గురువారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హిందూపురం: జిల్లాలోనే ప్రముఖ రాతి శివాలయమైన త్యాగరాజనగర్‌లోని ఉమానర్మదేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవంతో పాటు హోమాలు నిర్వహించారు. అనంతరం ఉమానర్మదేశ్వరస్వామి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా సాగింది.

'సిద్ధం' సభ చరిత్రలో నిలిచిపోవాలి

- మడకశిర నుంచి సభకు భారీగా తరలిరావాలి
- వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

మడకశిర: రాప్తాడు వద్ద ఈ నెల 18న జరిగే సిద్ధం సభ చరిత్రలో నిలిపోవాలని మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, మడకశిర సమన్వయకర్త ఈర లక్కప్ప, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిద్ధం సభ విజయవంతంపై పార్టీ నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ప్రాంతాల వారీగా సిద్ధం పేరుతో సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, మడకశిర నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. ఈ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, హిందూపురం, పెనుకొండ పార్టీ పరిశీలకులు రెడ్డీశ్వర్‌రెడ్డి, బాబురెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మండలాల కన్వీనర్లు యంజారేగౌడ్, నరసింహారెడ్డి, స్టూడియో శ్రీనివాస్, జెడ్పీటీసీలు భూతరాజు, సరోజమ్మ, ఎంపీపీలు కవిత, రేణుకమ్మ, బీసీ సెల్ అధ్యక్షులు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బుధవారం దళిత హక్కుల పరిరక్షణ సమితికి సంబంధించిన 2024 క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

కలసి కట్టుగా పని చేయండి

అమరాపురం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగరవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన అమరాపురంలోని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, శివకుమార్‌గౌడల కుటుంబాలను కలిశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతోనూ మాట్లాడారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, హలుకూరు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

గోరంట్ల: సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్ర పథంలో నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని పెనుకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లాపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బూగానిపల్లితాండ, బూగానిపల్లి, యం.కొత్తపల్లి, మల్లాపల్లి, కళ్లగేర, మోట్రాపల్లి, కళ్లగేరతాండ గ్రామాల్లో బుధవారం సర్పంచ్ శివానంద ఆధ్వర్యంలో చరణ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు.

సిద్ధం సభకు తరలిరావాలి

చిలమత్తూరు: రాప్తాడు వద్ద ఈనెల 18న నిర్వహించే సిద్ధం సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో వారు సమావేశాన్ని నిర్వహించారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవం

గుడిబండ: మండల కేంద్రంలోని సంతమార్కెట్ ఆవరణలో బుధవారం నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభించారు. అయ్యప్పస్వామితో పాటు మహా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను సుక్షేత్ర సిద్ధరబెట్ట వీరభద్ర శివాచార్య స్వామి, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు.

నెమలి మృతి



సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న గ్లోవీస్ కంపెనీ వద్ద గోడను ఢీ కొని నెమలి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుక్క తరుముకు రావడంతో కుక్క బారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నం చేయగా ఎగిరే క్రమంలో నెమలి గోడను బలంగా గుద్దుకుంది. తలకు గాయమై మృతి చెందగా స్థానికులు అటవీశాఖ అధికారుకలు సమాచారం అందించారు. నెమలిను ఫారెస్ట్ సిబ్బంది కార్యాలయానికి తరలించారు.

'టీడీపీ నాయకులే భూకబ్జాకోరులు'

రొద్దం: టీడీపీ నాయకులే భూకబ్జాదారులని వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతీరెడ్డి, ఆంజనరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పెద్దగువ్వలల్లి వద్ద సర్వేనంబర్ 1279లో ఓ ఆలయానికి సంబంధించిన భూమిని వైఎస్సార్‌సీపీ నాయకలు ఆక్రమించారని ఎల్లో పత్రికలో అవాస్తవాలు రాయించడం సరికాదని ఒక ప్రకటనలో వారు ఖండించారు. వాస్తవాలను కప్పిపెట్టి రాయడంపై మండిపడ్డారు. ఆలయ భూమిని టీడీపీ నాయకులు ఆక్రమణ చేసి ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. నిజాలు తెలుసుకోకుండా ఎల్లో పత్రిక వార్తలు రాసిందని తెలిపారు. నిరుపేదలకు చెందాల్సిన మాన్యం భూమిని టీడీపీ నాయకులు కబ్జా చేశారని పేర్కొన్నారు.

చౌళామాంబదేవికి పూజలు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన చౌళామాంబదేవి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈర లక్కప్ప ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు వారిని సన్మానించారు.

ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండలంలో 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో కూరగాయల ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. బాగేపల్లి మార్కెట్ నుంచి పెనుగొండకు కూరగాయలు తరలిస్తుండగా చెక్‌పోస్ట్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆటోడ్రైవర్ మహబూబ్‌బాషా గాయాలయ్యాయి. అలాగే కొడికొండ చెక్‌పోస్ట్ - చిలమత్తూరు ప్రధాన రహదారి విశ్వశ్రీ పాఠశాల సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 ద్వారా బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్: పట్టణానికి చెందిన ఓ మహిళ రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకెళితే... పట్టణంలో నరేష్ అనే వ్యక్తి ఓ భూమికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తనకు రూ.20 లక్షలు మోసం చేశారంటూ భారతి అనే మహిళ ఆరోపించింది. అతని ఇంటి వద్దకు వెళ్లి నిలదీయడంతో అతను స్పందనలో ఫిర్యాదు చేశాడు. దీనిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విషయం తెలుసుకొన్న భారతి బుధవారం తనను మోసం చేయడమే కాకుండా తను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పుడు తనపై ఎలా కేసు నమోదు చేస్తారని ప్రశ్నించింది. మనస్తాపానికి గురై సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్థానికులు, పోలీసులు అడ్డుకున్నారు. సీఐ రియాజ్ అహమ్మద్‌ను 'సాక్షి' వివరణ కోరగా సివిల్ వ్యవహారాల్లో తాము తలదూర్చమన్నారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి సమీపంలోని హ్యూమ్ పైప్ ఫ్యాక్టరీలో పనిచేసే అన్నారన్ అనే రాజస్థాన్‌కు చెందిన కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ వైరు తగిలి కింద పడటంతో కాలు విరిగింది. క్షతగాత్రుడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726